క్లుప్తంగా

నాగావళి నదికి హారతులు



నదిలో దీపాలు వదులుతున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళం కలెక్టర్ బంగ్లా వద్ద కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద శనివారం నాగావళి నదీ మాతృకా హారతులు కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు బూరాడ వంశీ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో 16 హారతులను ఇచ్చారు. భక్తులు ఆలయ కమిటీ సరఫరా చేసిన అరటి దొప్పలలో దీపాలు వెలిగించి నదిలో వదిలారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లోకనాథం నందికేశ్వరరావు, మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహంకాళీ పూజలు



పూజలందుకుంటున్న మహంకాళి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని రెల్లవీధిలో బెంగాలీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహంకాళీ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రెల్లవీధి, ఇల్లీసుపురంలోని 50 బెంగాలీ కుటుంబాలు పూజా కార్యక్రమంలో పాల్గొంటున్నాయి. ఆదివారం నిమజ్జనోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థికి చక్రాల కుర్చీ వితరణ



జశ్వంత్‌కు కుర్చీని అందజేస్తున్న గౌతమి

శ్రీకాకుళం కల్చరల్: అంగవైకల్యంతో బాధపడుతున్న పొందూరు మండలం డొల్లవలస గ్రామానికి చెందిన బి.జశ్వంత్ అనే విద్యార్థికి ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో అసోసియేట్‌గా విధులు నిర్వహిస్తున్న నల్ల గౌతమి అండగా నిలిచారు. శనివారం మూడు చక్రాల కుర్చీని వితరణగా అందించారు. కార్యక్రమంలో యోగా గురువు టి.ధనుంజయరావు, ఎమెర్జెన్సీ బ్లడ్ సర్వీస్ నిర్వాహకులు నంది ఉమాశంకర్, హరిబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు దిలీప్, జి.పవన్‌కుమార్, జె.చంద్ర, నంది ఉమాశంకర్, నల్ల గౌతమి పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

గార: శ్రీకూర్మం క్షేత్రంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి అదే గ్రామానికి చెందిన సింహాద్రి మోహిత్ కుటుంబ సభ్యులు శనివారం రూ.51 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జి.గురునాథం, ప్రధానార్చకులు సీహెచ్.సీతారామనృసింహాచార్యులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో సీఎం కార్యదర్శి



ప్రద్యుమ్నకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని సీఎం కార్యదర్శి, ఐఏఎస్ అధికారి పి.ఎస్.ప్రద్యుమ్న శనివారం దర్శించుకున్నారు. ఈవో వై.భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం అరసవల్లి ఆలయానికి ప్రసాద్ స్కీం అమలు, అభివృద్ధి పనులు, మాస్టర్ ప్లాన్ అమలు చిత్రాలతో కూడిన ఫొటో ఎగ్జిబిషన్ వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, డీఆర్వో వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల్లో విభేదాలు!

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కాలేజ్‌లో అధ్యాపకుల మధ్య విభేదాలపై అధికారులు శనివారం పంచాయితీ నిర్వహించారు. లాంగ్వేజ్ క్లబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటుకు సంబంధించి గదుల ఎంపికపై అధ్యాపకుల మధ్య పొంతన కుదరలేదు. దీంతో కొందరు అధ్యాపకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రిన్సిపాల్, అధ్యాపకులను పిలిపించి ఆరా తీశారు. అధ్యాపకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రమశిక్షణతో మెలిగి విద్యార్థుల ప్రయోజనాలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

శివ కేశవ ఆలయాలకు..

కార్తీక శోభ

- విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు
- నాగావళి నదిలో హారతులు
- లక్ష తులసీ దళార్చనలు
- రేపటి నుంచి కార్తీక సోమవారాలు ప్రారంభం



ఉమారుద్ర కోటేశ్వరస్వామి



పాలకొండరోడ్డులోని కోదండరామాలయం

శ్రీకాకుళం కల్చరల్: పవిత్ర కార్తీక మాసం సందర్భంగా శ్రీకాకుళం నగర పరిధిలోని శివ,కేశవ ఆలయాలు ముస్తాబయ్యాయి. రేపటి నుంచి కార్తీక సోమవారాలు ప్రారంభం కావడంతో ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రధాన ఆలయాల్లో దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. అత్యంత పవిత్రమాసంగా భావించే కార్తీక మాసంలో వేలాదిగా భక్తులు ఉపవాసదీక్షలు తీసుకొని శివుని దర్శనం కోసం ఆలయాలకు తరలివస్తుంటారు.

శివాలయాలు సిద్ధం..

●జిల్లా కేంద్రంలో అతిపురాతన దేవాలయంగా గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయం ప్రసిద్ధిగాంచింది. కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దశమి, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి, చతుర్దశి, పౌర్ణమి(పంచరత్నా) రోజుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

●నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అర్చకులు బి.అశ్వినీకుమార్, మహేష్ తెలిపారు. ఈ నెలంతా ప్రతిరోజూ స్వామికి అభిషేకాలు, అర్చనలు జరుగుతాయని, ప్రత్యేక రోజు పౌర్ణమి నాడు జ్వాలా తోరణం, స్వామికి అన్నాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.



విద్యుత్ వెలుగుల్లో పాతశ్రీకాకుళంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం

●కొన్నావీధిలోని భీమేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 3గంటలనుంచే స్వామివారి దర్శనం ఉంటుంది. కార్తీక మాసం పురస్కరించుకొని ఉచిత ప్రసాదం, భీమేశ్వర భజన బృందంచే భజన పాటలు తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రుద్రాభిషేకాలు, క్షీరాభిషేకాలు ఉంటాయని ఈఓ మాధవి, అర్చకులు గంట చిన్న రామమూర్తి తెలిపారు.

●బలగ ఉత్తరేశ్వరాలయం, గుజరాతిపేటలోని లక్ష్మేశ్వరస్వామి ఆలయం, దీపామహల్ వెనుక ఉన్న శివకేశవ ఆలయం, పాతశ్రీకాకుళంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాలు భక్తుల దర్శనాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరుడు

వైష్ణవ ఆలయాల్లో సందడి..

కార్తీకమాసం విష్ణుమూర్తికి కూడా ప్రీతికరం కావడంతో ఈ నెలలో వైష్ణవ ఆలయాలు కూడా భక్తులతో రద్దీగా ఉంటాయి. అందుకు తగ్గట్టుగా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష తులసీ దళార్చనలు ఈ నెల 8 నుంచి 19 తేదీ వరకు నిర్వహిస్తున్నారు.

దీపారాధనలు..

కలెక్టర్ బంగ్లా వద్ద కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి నాగావళి నదీ హారతి కార్యక్రమం నిర్వహిస్తాం. సాయంత్రం ఆకాశ దీపారాధన, సహస్ర దీపాల అలంకరణ, శ్రీవారి అమ్మవార్ల తెప్పోత్సవం ఉంటుంది. పోలిపాడ్యమి సందర్భంగా అన్నప్రసాద వితరణ నిర్వహిస్తాం.

– యోగేశ్వరరావు, నాగేశ్వరరావు, కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు

ప్రత్యేక ఏర్పాట్లు

పాలకొండ రోడ్డులోని అతిపురాతన కోదండ రామాలయంలో కార్తీక మాసం సందర్భంగా భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. ప్రతిరోజు సాయంత్రం ఆకాశదీపారాధన, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– బంకుపల్లి శేషాచార్యులు, అర్చకులు, కోదండ రామాలయం

డంపింగ్ యార్డులా ప్రహరీ



ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్‌కు వెళ్లే రహదారిలో ఓ ప్రైవేట్ విద్యా సంస్థ ప్రహరీకి ఆనుకొని వ్యర్థాలను పడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా డంపింగ్ యార్డులా మారింది. వ్యర్థాలు తగలపెట్టేటప్పుడు పొగతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. వాస్తవానికి కళాశాల యాజమాన్యమే అంతర్గతంగా డంపింగ్ యార్డ్ నిర్వహణ, చెత్త రీసైక్లింగ్ చర్యలు చేపట్టాల్సి ఉంది.

–ఎచ్చెర్ల క్యాంపస్

గోతులు పూడ్చేదెన్నడో?



పాత్రునివలస టిడ్కో కాలనీకి వెళ్లే దారిలో పైపులైన్ల కోసం తీసేసిన గోతులను అలాగే వదిలేశారు. పనులు జరిగి నెలలు కావస్తున్నా గోతులు పూడ్చక పోవడంతో రాత్రివేళల్లో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– శ్రీకాకుళం రూరల్

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



లావేరు మండలం అదపాక ఉన్నత పాఠశాలకు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పిసిని వీర వెంకట సత్యనారాయణ రూ.50 వేలు విలువైన కంప్యూటర్‌ను శనివారం బహూకరించారు. దాతకు ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు, గొంటి గిరిధరరావు, ఉదయ్‌కుమార్, జి.బాలకృష్ణ, కామేశ్వరరావు, మురళీ, వాసుదేవరావు, దాలయ్య ధన్యవాదాలు తెలిపారు.

– ఎచ్చెర్ల

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



గోసాం ఫీడర్ పరిధిలో కెల్లపేట పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. శుక్రవారం రాత్రి విద్యుత్ స్తంభం నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ను దించి అందులోని రాగి పట్టుకుపోయారు. శనివారం ఉదయం రైతులు పొలానికి వెళ్లి చూసేసరికి ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం కావడంతో జే.ఆర్.పురం పోలీసులకు, రణస్థలం విద్యుత్‌శాఖ ఏఈ తిరుపతిరావుకు ఫిర్యాదు చేశారు.

– రణస్థలం

స్కూల్‌గేమ్స్ రాష్ట్రపోరుకు సిద్ధం



కోడిరామ్మూర్తి క్రీడామైదానంలో ట్రాక్‌ను పరిశీలిస్తున్న ఎస్‌జీఎఫ్ అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా విద్యాశాఖ పరిధిలోని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆది, సోమవారాల్లో జరగనున్న 68వ ఏపీ రాష్ట్రస్థాయి(అంతర్ జిల్లాల) స్కూల్‌గేమ్స్ బాలబాలికల అథ్లెటిక్స్ (అండర్–17), ఉషూ (అండర్–17,19) చాంపియన్‌షిప్–2024 పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా కేంద్రంలో పోటీలు జరగనుండటంతో అధికారులు, ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక కోడి రామ్మూర్తి క్రీడామైదానంలో అండర్–17 బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు జరగనుండగా, సమీపంలోని శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల సిల్వర్‌జూబ్లీ ఆడిటోరియం వేదికగా అండర్–17, 19 బాలబాలికలకు ఉషూ పోటీలు జరుగనున్నాయి. డీఈఓ, ఎస్‌జీఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య నేతృత్వంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, సుందరరరావు మాస్టారు, కె.హరిబాబు, కె.మాధవరావు, నారాయణరావు, ఆయా సంఘ ప్రతినిధులు, పీడీలు సమీక్షిస్తున్నారు.

1300 మంది వరకు ప్రాతినిధ్యం..

రాష్ట్ర నలుమూలల నుంచి క్రీడాకారులు జిల్లాకు చేరుకున్నాయి. వివిధ జిల్లాల క్రీడాకారులు, కోచ్ మేనేజర్లు, నిర్వాహకులు, సంఘ ప్రతినిధులు, టెక్నికల్ అఫీషియల్స్, పీడీ, పీఈటీలు కలిపి 1300 మంది వరకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరందరికీ స్థానిక వసతి, భోజన ఏర్పాట్లు కల్పిస్తున్నారు. రెండు రోజులపాటు జరిగే పోటీలను విజయవంతం చేయాలని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, కార్యదర్శి బడి వెంకటరమణ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి పోటీలు మొదలుకానుండగా.. ఉదయం 10గంటలకు ప్రజాప్రతినిధులు నడుమ ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుందని ఎస్‌జీఎఫ్ అధికారులు తెలిపారు.

నేడు కారామాస్టారు శతజయంతి సెమినార్

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఆదివారం కాళీపట్నం రామారావు మాస్టారు శతజయంతి సెమినార్‌ను శ్రీకాకుళ సాహితి, సాహితీ స్రవంతిల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కేతవరపు శ్రీనివాస ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగు సెషన్లలో సెమినార్ జరుగుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, రచయితలు అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, గార రంగనాథం, చీకటి దివాకర్‌తో పాటు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన అనేక మంది కవులు, రచయితలు హాజరవుతారని తెలిపారు. సాహిత్యాభిమానులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అవినీతి రహిత సమాజమే ధ్యేయం



ర్యాలీ నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు, సిబ్బంది



ప్రతిజ్ఞ చేస్తున్న యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు

శ్రీకాకుళం క్రైమ్/శ్రీకాకుళం(పీఎన్‌కాలనీ): అవినీతి రహిత సమాజంతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు అన్నారు. శనివారం విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా నగరంలోని సూర్యమహాల్ జంక్షన్ నుంచి ఏడు రోడ్లు జంక్షన్ వరకు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విజిలెన్సు కార్యాలయం వద్ద స్థానిక పాఠశాల విద్యార్థులు, సిబ్బందితో 'సమగ్రతా ప్రతిజ్ఞ' నిర్వహించారు కార్యక్రమంలో విజిలెన్సు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: అవినీతి రహిత సమాజం ఏర్పాటుకు కృషి చేద్దామని యూనియన్ బ్యాంకు చీఫ్ మేనేజర్ బ్రిజేష్ సింగ్ పిలుపుఇచ్చారు. విజిలెన్స్ వారోత్సవాలు సందర్భంగా శనివారం గొంటివీధిలోని ఠాగూర్ స్కూల్‌లో యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అసిస్టెంట్ మేనేజర్ ఉదయ్‌కుమార్, ప్రిన్సిపాల్ బెహరా శ్రీదేవి, డైరెక్టర్ సాలిహుండం రవికుమార్, కరస్పాండెంట్ పి.సత్తిబాబు పాల్గొన్నారు.

4న మండల సర్వసభ్య సమావేశం

జి.సిగడాం: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 4న ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికారులంతా విధిగా హాజరుకావాలని కోరారు,

భూసర్వేపై ఫిర్యాదుల స్వీకరణ

ఎచ్చెర్ల క్యాంపస్: దోమాం గ్రామంలో భూసర్వేకు సంబంధించి శనివారం గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎ.సింహాచలం మాట్లాడుతూ ఎటువంటి సమస్యలు ఉన్నా రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్, 1– బీ వంటి సమస్యలను గ్రామం యూనిట్‌గా పరిష్కరిస్తామని చెప్పారు.

యువతకు నైపుణ్య శిక్షణ



సచివాలయం సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ట్రైనర్ రాము

జి.సిగడాం: యువతకు ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా నైపుణ్యాలను పెంపొందించవచ్చని ట్రైనర్ పొగిరి రాము అన్నారు. శనివారం జి.సిగడాం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గుంటుముక్కల రామకృష్ణ పర్యవేక్షణలో యువతకు నైపుణ్య శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం యువతకు అన్ని రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గోవర్ధనగిరి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: పొన్నాడ బ్రిడ్జి వద్ద ఇస్కాన్ జగన్నాథ మందిరంలో శనివారం గోవర్ధన గిరి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకృష్ణుడు గోవర్ధన గిరిని ఎత్తిన పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం చేశారు. అనంతరం లక్ష్మీపతి గౌడ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా గోవర్ధన గిరి ఆకారంతో ఏర్పాటు చేసిన కొండ వద్ద భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

వంశధార పనులు పూర్తిచేస్తాం

గార: వంశధార రిజర్వాయర్ పనులు పూర్తి చేయడంపై దృష్టి సారించామని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం గార పీహెచ్‌సీ, శ్రీకూర్మం పీహెచ్‌సీలో చెరో రూ. 50 లక్షలతో అదనపు భవనం నిర్మాణాలకు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌లతో కలిసి భూమిపూజ చేశారు. అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం ఆలయాలను ప్రసాదం పథకంలో అభివృద్ధి చేసేందుకు కేంద్రమంత్రి ఇప్పటికే లేఖ రాసినట్లు తెలిపారు. అనంతరం వమరవల్లి రెసిడెన్షియల్ పాఠశాలలను పరిశీలించారు. బందరువానిపేటలో కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. దీపావళి కింజరాపు ఎర్రంనాయుడు విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, గుండ భాస్కరరావు, గొండు మూర్తి, పీస రమణ అధికారులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: మండలంలోని అలికాం పంచాయతీ పరిధిలో రూ.12లక్షలు అంచనాతో చేపట్టనున్న అలికాం రోడ్డు పనులకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు.

ముద్దాడలో గ్రామసభ

ఎచ్చెర్ల క్యాంపస్: ముద్దాడ గ్రామంలో అభివృద్ధి ప్రణాళికపై శనివారం గ్రామసభ నిర్వహించారు. పలు పనులు గుర్తించి తీర్మానం చేశారు. సిమ్మెంట్ రోడ్డులు, డ్రైనేజ్‌లకు సంబంధించి పనులు గుర్తించినట్లు సర్పంచ్ ముద్దాడ శంకర్ తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో పనులు చేస్తామని వివరించారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

శ్రీకాకుళమ కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో రంగస్థల కళాకారుల 301వ నెలవారీ సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శనివారం లయశ్రీ నృత్య కళానికేతన్ నాట్యగురువు కె.పరిమళ శిష్యబృందం శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు అదరహో అనిపించాయి. ముందుగా జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ ప్రతి నెలా ఒక కార్యక్రమం నిర్వహిస్తూ కళాకారులకు ఆదర్శంగా సంస్థ నిలుస్తుందని, వారి కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. అనంతరం చిట్టి వెంకటరావు మాట్లాడుతూ డిసెంబర్‌లో రజతోత్సవ వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది జి.వి.రమణ, సన్‌రైజ్ ఆసుపత్రి వైద్యులు బొడ్డేపల్లి సురేష్, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లోలుగు వెంకటరమణ, ఎల్.రామలింగస్వామి, పన్నాల నర్సింహమూర్తి, బి.రామచంద్రదేవ్, నిక్కు హరిసత్యనారాయణ, మంతిన వాసుదేవాచారి, మెట్ట వేంకటరాజు, కంచరాన అప్పారావు, ఇంజరాపు రమణారావు, బీఎంఎస్ పట్నాయక్ పాల్గొన్నారు.

మాపైనే ఫిర్యాదు చేస్తారా?

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో అధికారులపై వర్సిటీలో తీసుకుంటున్న నిర్ణయాలు, ఇతర అంశాలపై స్థానిక కాంట్రాక్టు బోధన, బోధనేతర సిబ్బంది తమపై ఫిర్యాదు చేస్తున్నారని వారిని పిలిపించి హెచ్చరించినట్లు సమాచారం. కొందరు ఆకాశరామన్న ఉత్తరాలు, మరికొందరు తమ పేరిటే గవర్నర్, ఉన్నత విద్యా మండలి, ఉన్నత విద్యాశాఖలకు ఫిర్యాదులు చేయడంతో అధికారులు వివరణ కోరినట్లు తెలిసింది. ఈ మేరకు కొందరిని శనివారం తమ చాంబర్‌కు పిలిపించి హెచ్చరించినట్లు సమాచారం. ప్రధానంగా ఫిర్యాదుల్లో ఓ అధికారి విశాఖపట్నం నుంచి వర్సిటీకి రాకపోకలు సాధించేందుకు ప్రభుత్వ కారు వినియోగించడం, హెచ్‌ఆర్‌ఏ క్లెయిమ్, వర్సిటీలో కార్లు కంటే డ్రైవర్లు ఎక్కువగా ఉండటం, అదనంగా అద్దెకారు తీసుకునే ప్రయత్నం చేయటం, ప్రకటనలు లేకుండా నియామకాలు, ఆడిట్ అభ్యంతరాలు ఉన్నా రికవరీలపై దృష్టిపెట్టక పోవటం, నచ్చిన వారికే కీలక పదవులు కట్టబెట్టడంపై వర్సిటీలో చర్చ సాగుతోంది. మరోవైపు లక్ష జీతానికి విశ్రాంత ఉద్యోగిని ప్రత్యేక అధికారిగా నియమించడంపైనా ఎక్కువగా ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం.

యూటీఎఫ్ కార్యవర్గ ఎన్నిక



మాట్లాడుతున్న గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్

జి.సిగడాం: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్ కోరారు. శనివారం జి.సిగడాంలో కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడిగా బి.మహేష్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ దాలిరాజు, గౌరవ అధ్యక్షుడిగా ఎం.చంద్రశేఖర్, సహాయ అధ్యక్షులుగా టార్జన్‌బాబు, డాక్టర్ కూర్మాన అరుణకుమారిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ బోనేల గౌరీశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.